www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 28 నవంబర్ 2022
5
చిత్తూరు



4న శ్రీవారి దర్శనానికి రాష్ట్రపతి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రపతిగా ఎన్నికైన ద్రౌపది ముర్ము డిసెంబర్ 4న తిరుమల శ్రీవారి దర్శనం నిమిత్తం రానున్నారు. అదేరోజు రాత్రి తిరుమల పద్మావతి అతిథిగృహంలో బస చేసి 5న ఉదయం శ్రీవారిని, అమ్మవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నట్లు సమాచారం.



‘ఉపాధి’ బిల్లుల కోసం...

నాలుగు నెలలుగా నిరీక్షణ

జిల్లాలో రూ.కోటి 68 లక్షలు పెండింగ్ / జిల్లాలో తగ్గిన కూలీల సంఖ్య

ప్రజాశక్తి - యాదమరి

‘ఒకరోజు సర్దుకోవచ్చు.. ఒక నెల సర్దుకోవచ్చు.. అయితే జీవితమంతా సర్దుకుపొమ్మంటున్నారు.. ఉపాధి కూలి డబ్బులు ప్రతి శనివారం కూలీలకు ఇవ్వాల్సి ఉంది. అయితే వారం కాదు కదా నెలలు గడచినా పట్టించుకోని పరిస్థితి.. నెలల తరబడి బిల్లులు ఇవ్వకపోతే ఏం వండుకుని తినాలి’ అంటూ కూలీలు మండిపడుతున్నారు. నాలుగు నెలలుగా కూలి డబ్బులు లేక అప్పులు చేసి బతకాల్సి వస్తుంది.. గతంలో కరోనా సమయంలో మోడీ బియ్యమన్నా ఇచ్చేవారు. ప్రస్తుతం అదీ లేదు. చిత్తూరు జిల్లాలో నాలుగు నెలలకు సంబంధించి కోటి 68 లక్షల రూపాయల బిల్లులు పెండింగ్ ఉంది. ఉపాధి బిల్లులు నెలనెలా చెల్లించకపోవడంతో పని చేసే కూలీల సంఖ్యా తగ్గుతుంది.

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం ప్రకారం.. మస్టర్ పూర్తి చేసిన తేదీ నుండి 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించాల్సి ఉన్నా నిబంధనలు అమలు కావడం లేదు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో ఉపాధి కూలీల బిల్లులు నాలుగు నెలలుగా పనులు చేసిన కూలీల ఖాతాలో జమ కాలేదు. చిత్తూరు జిల్లాలో మొత్తం 31 మండలాలు ఉన్నాయి. గత నాలుగు నెలలుగా సుమారు ఏడు లక్షల పని దినాలు ఉపాధి కూలీలు చేశారు వీటికి సంబంధించిన బిల్లులు 1.68 లక్షలు రూపాయలు నిధులు విడుదల కావలసి ఉంది. ప్రభుత్వం నిధుల విడుదల్లో జాప్యం ఉండడంతో, గత నాలుగు నెలలుగా ఉపాధి కూలీలు గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసే సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తున్నది. ఉపాధి బిల్లులు సకాలంలో



రాకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలు దూర ప్రాంతాలకు వారి జీవనోపాధి కోసం వేరే పనులను ఆశ్రయించాల్సి పరిస్థితి ఏర్పడుతున్నది. జిల్లాలోని మండలాలను పరిశీలించినట్లయితే చిత్తూరుకు పరిధిలో ఉన్న యాదమరి మండలంలో నాలుగు నెలల్లో 29782 పని దినాలు కూలీలు పూర్తి చేసుకున్నారు వీరికి సరాసరి ఒకరోజు కూలి వేతనం 241రూపాయిగా చెల్లించాల్సి ఉంది. మండల పరిధిలో ఇప్పటివరకు రావలసిన బకాయిలు మొత్తం 76 లక్షల 53 వేల 974 రూపాయలు. ఉపాధి కూలి బిల్లులు వారి వ్యక్తిగత ఖాతాలో జమ కావలసి ఉంది. గతంలో యాదమరిలో రోజుకు 900మంది కూలీలు పని చేసేవారు. నాలుగు నెలలుగా ఉపాధి బిల్లులు రాకపోవడంతో మండలంలో కూలీల సంఖ్య ఉపాధి పనులకు రావడం లేదు. ప్రస్తుతం రోజువారి ఉపాధి కూలీలు 200 మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగిలి నాలుగు వందలు హౌసింగ్, హార్టికల్చర్ లో మస్టర్లు నమోదు చేసి పనులు కల్పిస్తున్నారు.

మూడు నెలలుగా ఎదురుచూపులు : అయ్యాకన్ను, కోనపల్లి దళితవాడ, యాదమరి



కోనాపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద సప్లై ఛానల్ పనులు ఆగస్టు నెలలో ఉపాధి పనులు చేసాము. మూడు నెలలు అయింది. ఇంతవరకు కూలి డబ్బులు మా అకౌంట్లో జమ కాలేదు. డబ్బులు సకాలంలో రాకపోవడంతో గ్రామ చుట్టుపక్కల వేరే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం.

12వేలు రావాలి : ఉషా, కోనాపల్లి గ్రామం, యాదమరి



ఉపాధి హామీ పనులు ఎనిమిది వారాలపాటు మా గ్రామంలో చేసాం. సుమారు 12 వేల రూపాయలు మాకు రావాల్సి ఉంది. వంద రోజులుగా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాం. ఆఫీసులో అడిగితే ఈరోజు రేపని సమాధానం చెబుతున్నారు. చేసిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో మహిళా సంఘంలో లోన్లు కట్టలేకపోతున్నాం.

వ్యక్తిగత ఖాతాలో జమవుతాయి : చంద్రశేఖర్, ఉపాధి హామీ సంచాలకులు



జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు బకాయిలు వారి వ్యక్తిగత ఖాతాలోనే జమవుతాయి. గ్రామాల్లో వ్యవసాయ రైతులు, ఉపాధి కూలీలకు వారికి అవసరమైన పనులకు అంచనాలు వేసి, వెంటనే పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

మహిళల్లో ‘స్వయం’ శక్తి

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ప్రభుత్వ పథకాలను కొందరు ఖర్చు పెట్టేస్తారు. కొందరు ఒక్కో అవకాశాన్ని మెట్టుగా మార్చుకుంటూ.. తమ జీవనంలో అద్భుతాలు సాధిస్తుంటారు.ఇందులో భాగంగా వైయస్సార్ ఆసరా, సున్నావడ్డీ, వైయస్సార్ చేయూత పథకాలు మహిళలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నాయి. ఈ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు ఆర్థిక పురోభివద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు.

బ్యాంకుల నుండి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన పొదుపు సంఘాల్లోని పేదింటి అక్కచెల్లెమ్మల మీద ఏ మాత్రం వడ్డీ భారం పడకుండా, ప్రభుత్వమే వారి తరఫున వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద ఆ భారాన్ని భరిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగా బ్యాంకుల్లో రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా చెల్లిస్తున్న డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీని అందిస్తున్నారు. ఎంత వడ్డీ అవుతుందో అంత మొత్తాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఇదిలా ఉండగా, వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధితో మహిళలు చిన్న, చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైయస్సార్ సున్నా వడ్డీ పథకం కింద (డిఆర్డిఏ) జిల్లా వ్యాప్తంగా 33,138 డ్వాక్రా సంఘాలకు మూడు విడతల్లో రూ.196.98 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. అలాగే మెప్మా ఆధ్వర్యంలో సున్నా వడ్డీ పథకం పథకం కింద మొత్తం మూడు విడతల్లో రూ.25.00 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది.

బ్యాంకు లింకేజీ ద్వారా (డి ఆర్ డి ఏ) 2019-20 ఆర్థిక సంవత్సరంలో 22,457 సంఘాలకు 860.8 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 29,020 సంఘాలకు 580.87 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 21,177 సంఘాలకు 1,076.23 కోట్లు, 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు 11,157 డ్వాక్రా సంఘాలకు రూ.546.89 కోట్లు రుణం రూపంలో అందజేశారు. బ్యాంకు లింకేజీ ద్వారా (మెప్మా) 2019-20 ఆర్థిక సంవత్సరంలో 3,869 సంఘాలకు 255.24 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో 3,818 సంఘాలకు 238.84 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 2,728 సంఘాలకు 224.31 కోట్లు, 2022 - 23 ఆర్థిక సంవత్సరంలో 1,157 డ్వాక్రా సంఘాలకు రూ.129.92 కోట్లు రుణం రూపంలో అందజేశారు. స్త్రీనిధి ద్వారా (డి ఆర్ డి ఏ) 2020-21 ఆర్థిక సంవత్సరంలో 20,262 సంఘాలకు 102.42 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో 39,552 సంఘాలకు 150.64 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 30,826 సంఘ మహిళలకు రూ.121.01 కోట్లు రుణం అందజేశారు.

ప్రభుత్వ పథకాలతో బాగుపడ్డాం



న ే న ు హనుమాన్ గ్రూప్ నందు సంఘ సభ్యురాలిగా గత 11 సంవత్సరాలుగా ఉన్నాను. నా భర్త చిప్స్ ప్యాకెట్లు ఊరూరా తిరిగి అమ్ముతూ మా కుటుంబాన్ని పోషించే వారు. ఆ వచ్చే సంపాదనతో కుటుంబ పోషణ ఇబ్బంది కావడంతో మేమే సొంతంగా ఇంట్లో చిప్స్ తయారు చేసి అమ్మేందుకు అవసరమైన పెట్టుబడి నిమిత్తం సంఘంలో బ్యాంక్ లింకేజి, స్త్రీ నిధి ద్వారా రుణం తీసుకుని ప్రారంభించాను. ఇప్పుడు మా తో పాటు 5 మంది మహిళలు పని చేస్తున్నారు. రోజుకు ఒక్కొక్కరికి రూ.250 చొప్పున వారికి భత్యం ఇస్తున్నాను. సొంతంగా వ్యాపారం చేయడం వలన ఖర్చులు పోనూ రోజుకు వెయ్యి రూపాయల వరకూ ఆదాయం అందుతున్నది. సభ్యురాలు కావడంతో సున్నా వడ్డీ, వైయస్సార్ ఆసరా కింద లబ్ది పొందాను. ఒకప్పుడు కుటుంబ పోషనకే ఇబ్బంది పడ్డ మా కుటుంబం నేడు మరో ఐదుగురికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకున్నాను

జయంతి, మేలిపట్ల (గ్రా), పుంగనూరు

జిరాక్స్ షాపు నుంచి.. సూపర్ మార్కెట్



నేను కనక దుర్గ మహిళా సంఘంలో 10 సం. లుగా సభ్యురాలిగా ఉన్నానని, నాకు ఎటువంటి ఉపాధి లేకుండా నా భర్త సంపాదించే సంపాదనతో కుటుంబ పోషణ చేసే దానినని, నా భర్తకు సాయంగా ఉండాలనే ఉద్దేశ్యంతో చిన్న మొత్తంతో చిల్లర అంగడి మరియు జిరాక్స్ షాప్ ను ప్రారంభించానని, తరువాత సంఘంలో బ్యాంక్ లింకేజి క్రింద రూ.1.50 లక్షలు, స్త్రీ నిధి క్రింద రూ.50 వేలు, పొదుపు క్రింద ఒక లక్ష రూపాయలు, వైయస్సార్ ఆసరా క్రింద రూ.90 వేలు, సున్నా వడ్డీ క్రింద రూ.8 వేలు మొత్తంతో కుప్పంలోని ప్రకాశం రోడ్ నందు సూపర్ బజార్ ను ప్రారంభించానని, ప్రస్తుతం షాపు బాగా జరుగుతున్నదని, రోజుకు 6 నుండి 7 వేల వరకు వ్యాపారం జరుగుతున్నదని, ఖర్చులన్నీ పోను నెలకు రూ.15,000 వేల వరకు ఆదాయం పొందుతున్నామని, మా అమ్మాయి బి ఫార్మసీ చదువుతోంది.

సుధారాణి, ప్రకాశం రోడ్, కుప్పం



పిడిఎఫ్ఫే ప్రత్యామ్నాయం : యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

యూటీఎఫ్, ఎస్టియు ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు బలపర్చిన ఎంఎల్సి అభ్యర్థులను గెలిపించాలని యూటీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ . వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. చిత్తూరు జిల్లాలో యూటీఎఫ్ కార్యాలయంలో యూటీఎఫ్, ఎస్టియు ఉపాధ్యాయ, ప్రజాసంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సమన్వయ కర్తగా యూటీఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతి రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలు, ప్రజాతంత్ర హక్కులు కాపాడేందుకు తూర్పు రాయలసీమ నుండి టీచర్ ఎంఎల్సి అభ్యరి పి. బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థి ఎన్ వెంకటేశ్వరరెడ్డి, పశ్చిమ రాయలసీమ టీచర్ ఎమ్మెల్సీగా కత్తి నరసింహారెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పి.నాగరాజు, ఉత్తరాంధ్ర జిల్లాలో గ్రాడ్యుయేట్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభలను మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించుకోవాలని కోరారు. గడిచిన మూడేళ్లుగాఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించబడకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. సిపిఎస్ రద్దు, మెరుగైన పిఆర్సి, సకాలంలో డిఎ ఏమైపోయాయని విమర్శించారు. తమకు రావాల్సిన బకాయిలు సైతం ఇవ్వకుండా పోరాటం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యమా...అని ప్రశ్నించారు. ఎస్టియు జిల్లా అధ్యక్షులు పి. దేవరాజులురెడ్డి, ఆర్థిక కార్యదర్శి మదన్ మోహన్ రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి రమణ, జిల్లా కార్యదర్శులు కె. రెడ్డెప్ప నాయుడు, టి. దక్షిణా మూర్తి పాల్గొన్నారు. అనంతరం యాదమరిలోని యుటిఎఫ్ కార్యాలయంలోనూ సమావేశం జరిగింది.

కొద్దిపాటి జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాలు అరికట్టొచ్చు

చిత్తూరుఅర్బన్: మానవ తప్పిదాల వలన జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించాలని చిత్తూరు జిల్లా ఎస్.పి రిశాంత్ రెడ్డి ఆదేశాల పై ఆదివారం చిత్తూరు డిఎస్పి శ్రీనివాస మూర్తి చిత్తూరు జిల్లాలోని జి.డి. నెల్లూరు, తవణం పల్లి పోలీస్ స్టేషన్స్ పరిధిలో గల బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి వాటిని సందర్శించారు. ఈ సందర్భముగా డిఎస్పి రోడ్డు ఆక్సిడెంట్ నివారణ లో భాగంగా బ్లాకు స్పాట్స్ వద్ద రోడ్ ఆక్సిడెంట్స్ నియంత్రణ కొరకు స్పీడ్ బ్రేకర్స్, బారికేడ్స్, రాత్రి సమయంలో బ్యారికేడ్లు కనిపించుటకు వాటి పై రేడియం స్టికేర్స్ ను వేయించమని అధికారులకు సూచనలు ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయానికి జెడ్పి నిధులు



చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయానికి జెడ్పి నిధులు కేటాయిస్తున్నట్లు మూడోస్థాయి సంఘ ఛైర్మన్, జిల్లా పరిషత్ వైస్‌ఛైర్మన్ ధనంజయరెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలోని జడ్పి ఛైర్మన్ ఛాంబర్‌లో మూడోస్థాయి సంఘ సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతుభరోసా, పిఎం కిసాన్, వైఎస్ఆర్ సున్నా వడ్డి పంట రుణాలు, ఉచిత పంటల బీమా, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. మూడవ స్థాయి సంఘ సమావేశంలో వ్యవసాయ, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక, మత్స్య, ఉద్యానవన, అటవీశాఖల ప్రగతి పై సమీక్షించారు. ఈ స్థాయి సంఘ సమావేశంలోజడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రత్న ప్రసాద్, సిరికల్చర్ జెడి శోభారాణి, పశుసంవర్ధక శాఖ జెడి వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు చిత్తూరుకు రోల్ అబ్జర్వర్ రాక

చిత్తూరుఅర్బన్: చిత్తూరుతో పాటు తిరుపతి, కడప, అన్నమయ్య జిల్లాల ఫొటో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమం-2023లో భాగంగా కేంద్రఎన్నికల సంఘం నాలుగు జిల్లాలకు రోల్‌అబ్జర్వర్ గా మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పి. ఎస్.ప్రద్యుమ్నను నియమించింది. రోల్ అబ్జర్వర్ ఈనెల29న చిత్తూరు కలెక్టరేట్ లో ఉదయం 11 గంటలకు ఓటరు జాబితా తయారీ, యువఓటర్ల నమోదు తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమవుతారని, అనంతరం రోల్ అబ్జర్వర్ అందుబాటులో ఉంటారని జిల్లా కలెక్టర్ యం. హరినారాయణన్ ఆదివారం ఒక ప్రక టనలో తెలిపారు.

మధ్యాహ్నం భోజన కార్మికులపై వేధింపులు వద్దు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్/ పలమనేరు

సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజనం కార్మికుల యూనియన్ జిల్లా 5 వ మహాసభలు రామ్మూర్తి అధ్యక్షతన స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుల కు కనీస వేతనం నిర్ణయించకుండా కేవలం రూ 3000 లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించడం అన్యాయమని ఆవేదన వెలిబుచ్చారు. జగనన్న గోరు ముద్ద పేరుతో ఇస్తున్న మెనూ చార్జీలు కు సంభంధం లేకుండా రోజు కు ఒక ఐటం తో మెనూ అమలుచేసి కార్మికులపై భారాన్ని మోపుతున్నదని విమర్శించారు. నూతన విద్యావిధానం అమలు తర్వాత విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికి కార్మికుల సంఖ్య పెరగలేదని వాపోయారు. మధ్యాహ్నం భోజనం పథకాన్ని ఇస్కాన్, అక్షయ పాత్ర లాంటి ప్రయివేటు సంస్థల కు ఇవ్వడం సరికాదని, సమస్య ల పరిష్కారం కోసం ఆందోళన లు చేయడానికి కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరల కు అనుగుణంగా బడ్జెట్ పెంపుదల చేయడం లేదని, 2020-21 ఆర్థిక సంవత్సరం లో కేంద్ర బడ్జెట్ లో రూ 13,215 కోట్ల నుండి రూ 12 వేల కోట్లకు, 2022-23 లో రూ 10,234 కోట్లకు తగ్గించిందని విమర్శించారు. గతంలో కేంద్ర ప్రభుత్వ వాటా 90 శాతం ఇచ్చేదని రాష్ట్ర ప్రభుత్వం వాటా 10 శాతాన్ని ఖర్చు పెట్టేదని, ప్రస్తుతం కేంద్రం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం మాత్రమే ఖర్చు పెట్టడం వల్ల కార్మికుల, విద్యార్థుల సంక్షేమం కుంటుబడుతున్నదని తెలిపారు. మెనూ బిల్లులు , వేతనం సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేసారు. మహాసభలు లో సీఐటీయూ నాయకులు మిన్నల్ జ్యోతి, కార్మిక నాయకులు నందిని, గాయత్రీ ,సుభాషిణి



ల తో బాటు వివిధ మండలాల నుండి మద్యాహన్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ సలోమిని విధుల్లో చేర్చుకోవాలి

ఉద్యోగం నుంచి అక్రమంగా తొలగించిన ఆశా వర్కర్ సలోమిని విధుల్లో చేర్చుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చైతన్య డిమాండ్ చేశారు. సిఐటియు నాలుగో మహాసభలు పలమనేరులో శనివారం సత్యమ్మగుడి సమావేశ హాలులో జరిగింది. సలోమిని విధుల్లో చేర్చుకోకపోతే పలమనేరు నుంచి చిత్తూరు జిల్లా వైద్యశాఖ కార్యాలయం వరకూ ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సభలో పట్టణ కార్యదర్శి గిరిధరగుప్తా, ఐద్వా నాయకురాలు భువనేశ్వరి, ఈశ్వర్, వరలక్ష్మి పాల్గొన్నారు.

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు మానుకోండి

చిత్తూరుఅర్బన్: రాప్తాడు ఎంఎల్ఎ ప్రకాష్‌రెడ్డి, అయన తమ్ముడు చంద్రశేఖర్‌రెడ్డిలు చంద్రబాబునాయుడు, తెలుగుదేశం పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలుగుదేశం నాయకులు పులివర్తి నాని, దొరబాబు, రాష్ట్ర నాయకులు సురేంద్రకుమార్‌లు పేర్కొన్నారు. రాష్ట్రంలో టీడీపీ నాయకులు పై జరుగుతున్న హత్యారాజకీయాలు , హత్యాప్రయత్నాలు , దాడులు జరుగుతున్న తీరు ను పరిశీలిస్తే చంద్రశేఖర్ రెడ్డి వ్యాఖ్యల వెనక పెద్ద కుట్రే ఉన్నట్లు అనుమానించి వలసి వస్తోందన్నారు. చంద్రశేఖరరెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర పోలీస్ శాఖ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

నేడు వాహనాల వేలం

చిత్తూరుఅర్బన్: చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌పరిధిలో సోమవారం నాలుగు మోటర్ సైకిళ్ళు, మూడు కార్లు, అలాగే పుంగనూరు పట్టణంలో డిసెంబర్ ఒకటో తారీకు 39 మోటర్ సైకిల్స్, రెండు ఆటోలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వేలం వేయనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పోలీస్‌శాఖ వెల్లడించింది. నిర్ణీత రుసుము చెల్లించిపాల్గొనాలని పేర్కొన్నారు.

ఆరనీకుమా... ఈ దీపం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



‘శతకోటి దరిద్రాలకు..అనంత కోటి ఉపాయాలు’ అన్న చందాన తయారయ్యింది శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద నేతి దీపాలు విక్రయిస్తున్న కొందరు వ్యాపారుల పరిస్థితి. ఒకపక్క ఆలయ అధికారులు భక్తులకు కల్తీ నేతి దీపాలు విక్రయించకుండా చర్యలు చేపడుతుంటే అక్రమార్కులు మరో మార్గంలో అక్రమాలకు తెరదీస్తున్నారు.. భక్తులను నిలువునా మోసం చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. వివరాల్లోకి పోతే.. శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో చాలా మంది వ్యాపారులు కల్తీ నేతి దీపాలు విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై కొందరు భక్తులు ఆలయ పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు దష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన కల్తీ నేతి దీపాలపై ప్రత్యేక దష్టి సారించారు. కల్తీ నేతి దీపాలు విక్రయించకుండా కొద్ది రోజులు ఆంక్షలు విధించారు. అయితే ఆయనపై కొందరు వ్యాపారులు రాజకీయ ఒత్తిళ్లు తేవడంతో మళ్లీ నేతి దీపాలు విక్రయించుకోవడానికి అనుమతి ఇవ్వాల్సి వచ్చింది. అయితే అసలైన నేతి దీపాలు మాత్రమే విక్రయించాలనే నిబంధన విధించారు. ఇందుకు వ్యాపారులు కూడా అంగీకరించారు. ఇలా కొన్ని రోజుల పాటు ఈ నిబంధన పాటించారు. ఇందుకు అందరూ సంతోషించారు. అయితే కార్తీకమాసం ఆరంభమైనప్పటి నుంచి వ్యాపారులు మళ్లీ అడ్డదారులు తొక్కుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇందులో శ్రీకాళహస్తి పట్టణం సూపర్ బజారు కూడలి సమీపంలో ఉండే ఓ వ్యాపారి కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈయన నెయ్యికి బదులు వేరే నూనెను నేతి దీపాల వ్యాపారులకు విక్రయిస్తున్నాడని సమాచారం. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం 50 గ్రాముల నెయ్యి రూ.45లు పలుకుతోంది. అయితే ఈయన నెయ్యి పేరుతో 50 గ్రాములు నూనెను రూ.6.50కే వ్యాపారులకు ఇస్తున్నాడని చెప్పుకుంటున్నారు. ఇలా 20 సీసాలను రూ.130కి వ్యాపారులకు ఇస్తున్నాడు. అదే అసలు నెయ్యి అయితే 20 సీసాలకు రూ.900లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కారణంగా నేతి దీపాల వ్యాపారులు అసలు నేతికి బదులు ఈ నూనెను కొనుగోలు చేసి భక్తులకు నేతి ధరకే అంటగడుతున్నారు. ఇది అసలైన నెయ్యి అని చెబుతున్నారు. ఒక్కో దీపం రూ.100 వంతున భక్తులకు విక్రయిస్తున్నారు. ఈ దీపం రూ.50లు కూడా ఉండదు. అయినా రెట్టింపు ధరకు భక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకూ తెలుసు. అయినా ఎందుకో చర్యలు తీసుకోవడం లేదు. ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఇకనైనా స్పందించి నేతి దీపాల పేరుతో జరుగుతున్న అక్రమాలను అరికట్టాల్సి అవసరం ఎంతైనా ఉంది. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రేషన్ బండ్లపై నిఘా

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఎండియు (రేషన్ సరుకులు ఇంటింటికీ చేరవేసే బండ్లపై ప్రభుత్వం నిఘా పెడుతోంది. ఈ వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టనుంది. ఈ బండ్లను జిపిఎస్‌తో అనుసంధానం చేసి, సిసి కెమరాలు ఏర్పాటు చేయనున్నారు. రేషన్ సక్రమంగా పంపిణీ అవుతుందా..? లేదా..? అనే దాన్ని తెలుసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తద్వారా ఇందులోని అవకతవకలను అరికట్టేందుకు ఆస్కారం దొరకనుంది.

జిల్లాలో 5.31 రేషన్ కార్డులున్నాయి. ఇవి 1379 చౌకదుకాణాల నుంచి మొబైల్ వాహనాల ద్వారా సరాఫరా చేస్తున్నారు. 336 వాహనాల ద్వారా ప్రతి నెలా ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. 12వేల టన్నుల బియ్యం, కందిపప్పు, పంచదార వంటివి పంపిణీ చేస్తున్నారు. అయితే 90 శాతం మందికి మాత్రమే సరుకులు అందుతున్నాయి. రేషన్ షాపుల ద్వారా జరుగుతున్నప్పుడు కూడా ఇదే పరిస్థితి. ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి సరుకులు ఇవ్వాలని ఆదేశించినా ఎక్కడా అమలు కావడం లేదు. గతంలో ఉన్న అక్రమాలే సాగుతున్నాయి. ముఖ్యంగా ఈ రేషన్ బండ్ల వద్ద దళారులు బియ్యం కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిని అరికట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిపిఎస్‌తో అనుసంధానం
అవకతవకలు సరిదిద్దేందుకు ఆస్కారం

ఇందులో బాగంగా జిల్లాలో ఉన్న 31 మండలాల్లో బండ్లను జిపిఎస్‌కు అనుసందానం చేయనున్నారు. అయితే మండలానికి ఒకదానికి మాత్రమే దీన్ని అమలు చేయనున్నారు. ఇలా మన జిల్లాలో 31 వాహనాలకు జిపిఎస్, సిసి కెమరాలను అనుసంధానం చేసి జిల్లా పౌరసరఫరాల శాఖా కార్యాలయం నుంచి దీన్ని పర్యవేక్షించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర కేంద్రం నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. త్వరలో వీటిని ఏర్పాటు చేసేందుకు సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. పైలట్ ప్రాజెక్టుల్లో ఈ విధానం విజయవంతమయితే దశల వారీగా దీన్ని అమలు చేయాలని నిర్ణయించారు. అసలే ఇంటింటికీ రేషన్ విధానమే తప్పని ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తుంటే ఇప్పుడు వీటికి జిపిఎస్, సిసి కెమరాలు ఏర్పాటు చేయాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని వారు అంటున్నారు.

డంపింగ్ యార్డులో పుట్టినరోజు వేడుకలు

చిత్తూరుఅర్బన్: కాలుష్యం... దుర్వాసన... అపరిశుభ్రం... డంపింగ్ యార్డు పేరు చెప్తే గుర్తొచ్చే పదాలు ఇవే. కానీ ఇందుకు భిన్నంగా చిత్తూరు నగరపాలక సంస్థ డంపింగ్ యార్డు ను ఆహ్లాదకరంగా మార్చే వినూత్న కార్యక్రమానికి నగరపాలక కమిషనర్ డా. జె అరుణ శ్రీకారం చుట్టారు. సంతపేటలోని చిత్తూరు నగరపాలక సంస్థ డంపింగ్ యార్డులో ఇటీవల చేపట్టిన ప్రత్యేక చర్యలతో డంపింగ్ యార్డ్ పరిసరాలు ఆహ్లాదకరంగా మారాయి. ఈ నేపథ్యంలో ఆదివారం డంపింగ్ యార్డ్ ఆవరణలో స్థానికంగా ఉన్న ఒక కుటుంబం తమ చిన్నారి పుట్టినరోజు వేడుకలను ఘనంగా “జీరో వేస్ట్” అంశంతో ప్లాస్టిక్ రహితంగా నిర్వహించారు. నగరానికి చెందిన షర్ఫన్, ఉమర్ లు కుమార్తె రియా మొదటి పుట్టినరోజు వేడుకలు ఆదివారం చిత్తూరు నగరపాలక సంస్థ డంపింగ్ యార్డ్ ఆవరణలో ఘనంగా జరిగింది. ఇందుకోసం నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు డంపింగ్ యార్డులో అన్ని ఏర్పాట్లు చేయించారు. ఇటీవల కాలంలో డంపింగ్ యార్డ్ లో వ్యర్థాల నిర్వహణ ప్రత్యేక పద్ధతుల్లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య, లోకనాథం, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీ లు పాల్గొన్నారు.



సిఐటియు జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా కోశాధికారి బాలసుబ్రమణ్యం పిలుపు



ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట పుల్లయ్యపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం సిఐటియు మండల కమిటీ సమావేశం టి. నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా కోశాధికారి బాలసుబ్రమణ్యం, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి మునిరాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ... డిసెంబర్ 11,12 తేదీల్లో తిరుపతి యశోదనగర్ లోని ఎంబి భవన్ వద్ద సిఐటియు జిల్లా మహాసభలు ఘనంగా జరుగుతాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని రేణిగుంట సిఐటియు మండల కమిటీ సమావేశం ద్వారా పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కమిటీ నాయకులు నరసింహారెడ్డి, రాజశేఖర్, వెంకట రమణ, లక్ష్మీ విజయ్ కుమార్, జయరాంరెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

30న బహిరంగ వాహనాలకు వేలం

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: ఈ నెల 30న పుత్తూరు సెబ్ స్టేషన్‌లో బహిరంగంగా వాహనాలు వేలం జరుగుతుందని పుత్తూరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ పుత్తూరు డివిజన్ పరిధిలోని ఉన్న సెబ్ కార్యాలయంలో ఉన్న వాహనాలను ఈనెల 30వ తేదీన డివిజన్ పరిధిలోని సెబ్ స్టేషన్ల వాహనాలు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో పుత్తూరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో ఉన్న 14 ద్విచక్ర వాహనాలను సెబ్ స్టేషన్లో బహిరంగంగా వేలం జరుగుతాయని సూచించారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలను సమర్పించి వేలంలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

మధుకుమార్ సేవలు చిరస్మరణీయం


డాక్టర్ రవి రాజు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మధుకుమార్ సేవలు చిరస్మరణీయమని డాక్టర్ రవి రాజు పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయుడు మధుకుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం ఆ పాత్రికేయుని సంస్మరణ సభకు హాజరైన డాక్టర్ రవి రాజు, పాత్రికేయులు, మిత్ర బృందం.. నివాళులర్పించారు. అనంతరం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాజు మాట్లాడుతూ మధు కుమార్ సేవలు అభినందనీయమని. ఆయన పాత్రికేయ రంగంలో అనేక కథలు వివిధ రంగాల్లో కావలసిన కథనాలు, రచించేవారని, ప్రజల కోసం అనేక సేవలందించారని తెలిపారు. అలాగే న్యాయవాదిగా, కోర్టులో కూడా సేవలను అందించారు. ఈ సంతాప సభలో కేవీటీ రవిరాజు, హరిబాబు, కౌన్సిలర్ నరసింహారావు, పాత్రికేయులు మిత్రులు పాల్గొన్నారు.

సైన్సు సైనికుల్లా పనిచేద్దాం

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సమాజంలోని అస్పృశ్యతను, మూఢ నమ్మకాలను పారదోలి, ప్రజల్లో సైన్సు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జన విజ్ఞాన వేదిక డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ మాట్లాడుతూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదిక రూపుదిద్దుకుందన్నారు. ప్రజల్లో తిష్టవేసిన మూఢ నమ్మకాలను, అపోహలను, తారతమ్యాలను అంతం మొందించడమే లక్ష్యంగా పనిచేస్తోందని గుర్తు చేశారు. జన విజ్ఞాన వేదిక లక్ష్యాల కోసం ప్రతి కార్యకర్త పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక శ్రీకాళహస్తి డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి చెంచయ్య, ట్రెజరర్‌గా చిన్న గురవయ్య, ఉపాధ్యక్షులుగా మునిశేఖర్ రెడ్డి, ప్రవీణ్, సుబ్రమణ్యం, వెంకటేష్, రఘు, వెంకట కృష్ణయ్య, కార్యదర్శులుగా విజయ శేఖర్, నరేంద్ర, ప్రసాద్, రామకృష్ణయ్య, కమేష్, బాలాజీ, మణి, కార్యవర్గ సభ్యులుగా పార్థసారథి, వేణు, గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, రంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు నాగేశ్వరరావు, బుజ్జయ్య, పెంచలయ్య, రామలింగం, రాజేంద్రప్రసాద్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు చెంగయ్య, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు పుత్తూరు పట్టణంలోని స్థానిక కార్వేటినగర్ కూడలిలో హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ విభాగం ద్వారా స్టెప్ స్వచ్ఛంద సేవ సంస్థ, ఏపీఎస్ ఎసిఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సాంస్కృతిక కళాబృందం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై వీధి నాటకం రూపంలో కళాబృందం ద్వారా, పాటలు రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం రెడ్డప్ప, నాగేంద్రరావు, గంగయ్య, గురవయ్య, స్టెప్ సెల్ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్ పంపిణీ



ప్రజాశక్తి - గూడూరు రూరల్: రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసేబుల్(రెడ్ సంస్థ) ఆధ్వర్యంలో కీ'శే' సనిశెట్టి వెంకట శ్రీధర్ జ్ఞాపకార్థం వారి కుమారులు వంశీ కృష్ణ, సాయి కృష్ణ చైతన్య దాతృత్వంతో ట్రైయిసైకిల్, ఫల సరుకులను గూడూరు మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడివెళ్ళ శ్రీధర్, రాజ్ పురోహిత్ రాజేష్, రామలింగం, శ్రీనివాస ఆచారి, జమీర్ పాల్గొన్నారు.

'కర్ర సాము'ను కాపాడుకుందాం




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రాచీన విద్య కర్ర సామును కాపాడుకుందామని కర్ర సాము అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని పొన్నాలమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం కర్ర సాము అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. కర్ర సాము విద్య అంతరించిపోకుండా యువకులను భాగస్వాములను చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన అన్నారు. శ్రీనివాస్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్డు పనులకు శ్రీకారం

- మొదలుపెట్టిన ఆర్ అండ్ బి శాఖ అధికారులు
- 150 మంది ఆక్రమణదారులకు నోటీసులు జారీ
- రోడ్లు వెడల్పు చేయడంపై ప్రజల హర్షం

ప్రజాశక్తి-కోట : పట్టణంలోని కోట క్రాస్ రోడ్డు నుండి - తిమ్మానాయుడు పాళెం బైపాస్ రోడ్డు (కొత్తచెరువు) వరకు ఉన్న రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రోడ్లు గుంతలమయంగా ఉండటంతో ప్రజలు, వాహనదారులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. ఈ రోడ్లపై ఉదయం పూట అయితే గోతులు కనిపిస్తాయి కాబట్టి పడిలేస్తూ ఏదోలా వెళ్లగల్గుతున్నారు. రాత్రివేళ అయితే ఇందులో పడి ఆసుపత్రిపాలు కావడం ఖాయం. కోట పట్టణ రహదారుల పరిస్థితి మరి దారుణంగా ఉన్నాయి. అడుగడుగునా గోతులతో దర్శనమిస్తున్నాయి. చినుకు పడితే చాలు చెరువులను తలపిస్తున్నాయి.

కోట ప్రజలు, వాహన చోదకులు పడుతున్న కష్టాలకు ఫలితం కనపడుతుందనే చెప్పవచ్చు. ఈ గుంతలమైన రోడ్లు, ఆక్రమణలపై తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణ రెడ్డి, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్‌లు వెంటనే స్పందించారు. గూడూరు ఆర్డీవో ఒక్క అడుగు ముందుకు వేసి కోట రోడ్ల దుస్థితి స్వయంగా వచ్చి పరిశీలించారు. ఆ తరువాత ఆర్డీవో, కోట ఆర్ అండ్ బి శాఖ కార్యాలయానికి వెళ్లి డీఈ అరుణమ్మతో



అంతకుముందు గుంతలమయంతో రోడ్డు

చర్చించారు. కోట రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని వాటికి శాశ్వతంగా పరిష్కారం చూపాలని ఆర్డీవో డీఈని అడిగారు. ఇద్దరూ కొద్దిసేపు చర్చించారు. కోటలో శాశ్వతంగా సిమెంటు రోడ్ల నిర్మాణం జరగాలని, అందుకు ఇప్పటికే రూ.15 కోట్లతో ఎస్టీమేషన్‌లు సెక్రటేరియట్‌కు పంపడం జరిగిందని అందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఆర్డీవో కోరారు.

అంతేకాకుండా కోట పట్టణంలో ఆర్ అండ్ బి స్థలాలు ఆక్రమణ చేయడం, కోట ఆర్టీసీ అను బేకరి షాప్ నుండి లచ్చరెడ్డి బిల్డింగ్ వద్దనున్న పంట కాలువ వరకు ఉండే డ్రైనేజీ కాలువలు పూడ్చి వేయడంతో డ్రైనేజీ నీరు రోడ్లపైకి రావడంతో రోడ్లు ధ్వంసమవ్వడంతో రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని చెబుతూ.. కోట పట్టణంలో ఆర్ అండ్ బి స్థలాల ఆక్రమణలపై సర్వే జరిగి మార్కింగ్ ఇచ్చి ఉన్నారని తెలిపారు. అక్కడ వరకు వ్యాపారస్తులు, ప్రజలు స్వచ్ఛంధగా ఆక్రమణలు తొలగించాలని ఆర్డీవో కోరారు.

ఆక్రమణ దారులకు నోటీసులు

కోట పట్టణంలో ఆర్ అండ్ బి స్థలాలు ఆక్రమణ చేసిన 150 మందికి గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ఆదేశాల మేరకు కోట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు నోటీసులు జారీ చేశారు. రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యే లోపు ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించాలని సంబంధిత అధికారులు కోరారు.

ఆర్డీవో ఆదేశాలు మేరకు కోటలో తాత్కాలిక పనులు మొదలు

కోట పట్టణంలో శాశ్వతంగా సిమెంట్ రోడ్లు మొదలుపెట్టే లోపు కోట పట్టణంలో ఉన్న గుంతల రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, అదేవిధంగా రోడ్లపై ఉన్న నీరు బయటకు పోయేలా రోడ్ల పక్క నున్న మట్టి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కిరణ్ కుమార్ ఆర్ అండ్ బి శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెండు రోజులుగా కోట క్రాస్ రోడ్డు నుండి కొక్కుపాడు రోడ్డు వరకు పనులు మొదలుపెట్టారు. ఇప్పటికే కొన్ని చోట్ల రోడ్లపై ఉన్న గుంతలను కాంక్రీట్ కంకరతో పూడ్చి వేశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న మట్టినితొలగిస్తున్నారు. దీంతో కోటకు మంచి రోజులు వచ్చినట్లు ప్రజలు భావిస్తున్నారు. కోట సమస్యలపై స్పందించిన జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్‌లకు అభినందనలు తెలియజేస్తున్నారు.



ఆక్రమణలను తొలగించి ట్రాక్టర్ సాయంతో రోడ్డును వెడల్పు చేస్తున్న దృశ్యం



రోడ్డుపై గుంతలు పూడ్చిన దృశ్యం

గ్యాస్ కనెక్షన్ ఉంటే ఉచిత బీమా

- లబ్ధిదారులను మోసంచేస్తున్న గ్యాస్ డీలర్లు
- 30 రోజులలోపు సమాచారం ఇవ్వాలి
- ప్రచారం లేక నష్టపోతున్న గ్రామీణ ప్రజలు


ప్రజాశక్తి -బాలాయపల్లి : మీకు గ్యాస్ కనెక్షన్ ఉంటే ప్రమాదశవత్తు ప్రమాదం జరిగితే ఉచితంగా రూ.50 లక్షల బీమా పొందవచ్చు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అవగాహన లేక అర్హులైన వారకి నష్టం జరుగుతుంది. గ్యాస్ కనెక్షన్ లేని ఇల్లు ఉండదు. ప్రతీ ఒక్క కుటుంబానికి ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్ ఉన్నప్పటికీ.. ఈ గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన విషయాలు వినియోగదారులకు తెలియవు. గ్యాస్ అయిపోయిందా... సిలిండర్ నింపిచ్చామా? వాడామా? అంత వరకే సగటు వినియోగదారులు ఆలోచిస్తారు.

ప్రమాద బీమా ఉందని తెలియదు:

గ్యాస్ సిలిండర్ ద్వారా ప్రమాదం జరిగితే ప్రమాద బీమా ఉంటుందన్న సంగతి చాలా మందికి తెలియదు. ఇక గ్యాస్ ఏజెన్సీలు సైతం ప్రమాద బీమాపై వినియోగదారులకు అవగాహన కల్పించరు. అందుకే గ్యాస్ కస్టమర్లు కచ్చితంగా ఈ బీమా సదుపాయాల గురించి తెలుసుకోవాలి. ఎల్.పి.జి గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వారికి రూ.50 లక్షల వరకు బీమా ఉంటుంది.

గ్యాస్ వాడేవారు తెలుసుకోవాలి ఇలా:

గ్యాస్ కనెక్షన్ తీసుకున్న వెంటనే ఎల్.పి.జీ బీమా సదుపాయం చేయబడుతుంది. రూ.40 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది. సిలిండర్ పేలుడు కారణంగా ప్రాణనష్టం సంభవిస్తే రూ. 50 లక్షల వరకు బీమా లభిస్తుంది. కుటుంబ సభ్యులు ఈ బీమాను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ క్రమంలో బీమా కోసం ఎలాంటి



అదనపు ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు.

బీమాను ఎలా క్లెయిమ్ చేయాలి?:

గ్యాస్ సిలిండర్ ద్వారా ప్రమాదం జరిగి ప్రాణ, ఆస్తి నష్టం జరిగితే.. ఈ ప్రమాదం జరిగిన 30 రోజులలోపు వినియోగదారుడు అతడు వినియోగించే గ్యాస్ ఏజెన్సీకి, పోలీసు స్టేషన్‌కు ప్రమాదం గురించి ఫిర్యాదు చేయాలి. అదీ కాక ప్రమాదానికి సంబంధించి పోలీసుల నుంచి ఎఫ్ఐఆర్ కాపీని తీసుకోవాలి. దాంతో పాటు మెడికల్ రసీదు, ఆస్పత్రి బిల్లు, ప్రాణనష్టం జరిగితే పోస్ట్ మార్టం రిపోర్టు, మరణ ధృవీకరణ పత్రాలు అన్ని కలిపి సంబంధిత గ్యాస్ ఏజెన్సీల వద్ద అందజేసి క్లెయిమ్ చేయించుకోవాలి.

రెగ్యూలర్‌గా సిలిండర్, స్టవ్ చెకప్ చేయించాలి:

బీమాకు అర్హులు కావాలంటే రెగ్యూలర్‌గా సిలిండర్, స్టవ్ చెకప్ చేయిస్తుండాలి. ఈ పాలసీలో ఎవరినీ మీరు నామినీగా చేయలేరు, ఎవరి పేరు మీద ఉంటే వారికే బీమా లభిస్తుంది. ఇక మీరు క్లెయిమ్ చేసిన ప్రమాదాన్ని మీ ఏజెన్సీ వారు ఏ కంపెనీ గ్యాస్ వాడుతున్నారో వారికి, బీమా కంపెనీలకు పంపిస్తారు. వివరాలకు మీ గ్యాస్ ఏజెన్సీలను సంప్రదించాలి. ఈ క్రమంలోనే బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, ఇండియన్ ఆయిల్ కంపెనీల కారణంగా ప్రమాదం సంభవిస్తే.. మెత్తం ఖర్చును ఈ కంపెనీలే భరిస్తాయి.

పల్లెల్లో వారికి అవగాహన కల్పించాలి



గ్రామీణ ప్రాంతంలో ఉన్నవారికి గ్యాస్ సిలిండర్ వల్ల ప్రమాదం జరిగితే బీమా ఉందన్న సంగతే తెలియదు. గ్యాస్ ఏజెన్సీలు ద్వారా అవగాహన కల్పించాలి

- శ్రీలక్ష్మి అలిమిలి బాలాయపల్లి మండలం

ప్రమాద బీమాపై అవగాహన కల్పిస్తాం:




మండలంలో ఎన్ని గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయో వివరాలు సేకరించి గ్రామాల్లో గ్రామసభల ద్వారా గ్యాస్ సిలిండర్ పేలితే బీమా సౌఖ్యంపై అవగాహన కల్పిస్తాం. **-అజ్మతుల్లఖాన్ తహశీల్దార్ బాలాయపల్లి**

వైభవంగా శ్రీపద్మావతి అమ్మవారి రథోత్సవం

ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం ఉదయం రథోత్సవం కన్నులపండుగగా జరిగింది. ఉదయం 7.10 గంటలకు రథోత్సవం మొదలై ఆలయ నాలుగు మాడ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో రథాన్ని లాగారు. సర్వాలంకార శోభితమైన రథంలో ప్రకాశించే అలమేలుమంగ సకలదేవతా పరివారంతో వైభవోపేతంగా తిరువీధులలో విహరించారు. రథోత్సవం అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి రథమండపంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రథోత్సవంలో శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, చంద్రగిరి ఎమ్మెల్యే టీటీడీ బోర్డు సభ్యులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, జేఈవో వీర బ్రహ్మం దంపతులు, సిఈ నాగేశ్వరరావు, విఎస్వోలు బాల్ రెడ్డి, మనోహర్, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు బాబు స్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ దాము పాల్గొన్నారు.

శ్రీ పద్మావతీ అమ్మవారికి బంగారు పతకం కానుక

శ్రీ పద్మావతీ కార్తక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వాహన సేవలో అమ్మవారికి అలంకరించేందుకు బంగారు



పతకాన్ని కానుకగా అందజేశారు. తిరుపతికి చెందిన కస్తూరి బాయ్ ట్రస్ట్ ఛైర్మన్ పి.సి.రాయల్. సుమారు 117 గ్రాముల బంగారుతో తయారుచేసిన పతకం విలువ రూ.5.50లక్షలు విలువ చేస్తుంది. బంగారు పతకాన్ని సమర్పించిన భక్తుడికి ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, ఆలయ అర్చకులు బాబు స్వామి, స్వాగతం పలికి అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.



పంచమితీర్థంకు అన్ని ఏర్పాట్లు పూర్తిటిటిడి ఈవో ధర్మారెడ్డి

తిరుచానూరు బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమితీర్థంకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. పంచమి తీర్థానికి వచ్చే భక్తులందరూ సమన్వయం పాటించి పుణ్య స్థానాలు ఆచరించాలని టీటీడీ ఈవో ధర్మారెడ్డి కోరారు. ఆదివారం ఉదయం తిరుచానూరులోని పంచమి తీర్థం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జెఈఓ వీరబ్రహ్మం, టిటిడి ముఖ్య భద్రత అధికారి నరసింహ కిషోర్, జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

కల్కి అలంకారంలో అశ్వవాహనంపై అమ్మవారు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం రాత్రి అమ్మవారు కల్కి అలంకారంలో అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. ఆలయం నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభియమిచ్చింది.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: ఆగి ఉన్న లారీని ఢీకొని ఇద్దరూ ద్విచక్ర వాహనదారులు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు వరదయ్యపాలెం మండలం చిన్నపాండూరు వద్ద ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో సత్యవేడు మండలం పెద్దఈటిపాకం గ్రామానికి చెందిన పీకే కృష్ణయ్య కుమారుడు మాజీ సర్పంచ్ జయశంకర్ రావు(40), అదే గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ కుమారుడు గీతప్రియన్(7) అక్కడే మృతి చెందారు. ఈ రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఇందులో జయశంకర్ రావు కుమారుడు సంజయ్, విజయ్ కుమార్ సతీమణి వెన్నెల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనంపై నలుగురు ప్రయాణిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసిన శ్రీసిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సూపర్ స్టార్ కృష్ణ మనసున్న మంచి మనిషి

- స్టేట్ వైడ్ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సినీ హీరో సూపర్‌స్టార్ కృష్ణ మనసున్న మంచి మనిషిని ఏపీ స్టేట్ సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు అభిమాన సంఘం స్టేట్ వైడ్ కన్వీనర్ ఎం. మధుసూదన్ రెడ్డి అన్నారు. తిరుపతి నగర సమీపంలోని మంగళం సర్కిల్‌లో అభిమాన సంఘం ఆధ్వర్యంలో దివంగత ఘట్టమనేని కృష్ణ దశదిన కర్మక్రియల నేపథ్యంలో ఆదివారం సంస్మరణ కార్యక్రమం నిర్వహించి పెద్ద ఎత్తున వెయ్యి మంది పేదలకు అన్నదానం చేపట్టారు. తిరుపతి నగర అధ్యక్షుడు వెంకటేష్, గుండ్లపల్లి నాగరాజు, డాక్టర్ కరుణ, శేషారెడ్డి, అమర్నాథరెడ్డి, మహేష్,, నాగేందర్, మండి రాము, కొండలరావు, ముని, అభిమానులు పాల్గొన్నారు.

కోట: సినీ నటుడు ఘట్టమనేని కృష్ణ ఇటీవలన మరణించడం అందరికి తెలిసిందే. ఈ మేరకు ఆదివారం కోట మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో కృష్ణ అభిమానులు ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు కోకర్ల మధు యాదవ్, మోపూరు. కృష్ణయ్య, మల్లి శ్రీనివాసులు, కృష్ణ అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాకాల: సూపర్ స్టార్ కృష్ణ సంస్మరణార్థం పాకాల మండలం వరదప్పనాయుడు పేటలో ఆదివారం అభిమాని చలం చలపతి రెడ్డి సుమారు 100 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా రంగానికి సూపర్ స్టార్ కృష్ణ లేనిలోటు తీర్చలేనిదన్నారు. రాజకీయ రంగంలో ఎదురు లేని నాయకుడిగా, సినీరంగంలో ఎవ్వరినైనా ఎదురించే నటుడిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా చరిత్ర సృష్టించారని కొనియాడారు.

ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: బోయబెంతో ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని యానాదుల సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా ఏపీ ఛైర్మన్ గురువారం చిరంజీవి పేర్కొన్నారు. యానాదుల సంక్షేమం సంఘం ముఖ్య నాయకులు పుత్తూరులో బోయబెంతో ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని విడుదల చేసిన జీవో నెంబర్ 52 ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడం ఖండన తెలియజేశారు. రిటైర్డ్ ఐఏఎస్ కమిషన్ పర్యటన రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలియజేస్తూ ఆందోళన చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం వెంటనే జీవో నెంబర్ 52 ను రద్దు చేయాలని కోరుతూ లేని పక్షంలో ఉద్యమం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. అజెండా వారిగా నిరసనలు గ్రామస్థాయిలో నుండి జిల్లా స్థాయి వరకు ఉంటుందని ఛైర్మన్ గురువారం చిరంజీవి అన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు ఎన్జీవో, ప్రజా ప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేసి భారీ ర్యాలీ జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని తెలిపారు. చిత్తూరు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రెండు రోజులు ఎస్టీ ప్రజలు మద్దతు తెలిపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్నయ్య జయశంకర్, ఆదినారాయణ, శ్రీనివాసులు, సుబ్బరాజు, రాజశేఖర్, సరిత పాల్గొన్నారు

నిబంధన పక్కనబెట్టి..ప్రాణాలు కాపాడారు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆపదలో ఉన్నవారికి ఠక్కున గుర్తొచ్చేది 108. అయితే 108 నుంచి అధికారిక కాల్ వస్తేనే సాయం అందేది. అయితే ఆ నిబంధన పక్కనబెట్టి రోడ్డుప్రమాదంలో గాయపడ్డ యువకులకు సకాలంలో చికిత్స అందేలా చేసి ప్రాణాలు నిలిపారు శ్రీకాళహస్తి 108 సిబ్బంది. వివరాల్లోకి పోతే..108 పైలట్ హరీష్ రెడ్డి ఓ కేసు నిమిత్తం శ్రీకాళహస్తి నుంచి కేవీబీపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గంమధ్యలో రాజీవ్ నగర్ వద్ద తమ కళ్లెదుటే ఇద్దరు యువకులు కుక్కను తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడ్డారు. ఈ ఘటనలో నాగేంద్ర, చెందు అనే యువకులకు గాయాలయ్యాయి. వీరిలో చందు పరిస్థితి విషమంగా ఉండడంతో 108 పైలట్ హరీష్ రెడ్డి శ్రీకాళహస్తిలోని మరో 108 వాహనానికి సమాచారం అందించారు. దీంతో ఈఎంటి మానస పైలట్ భగవాన్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన చెందుకి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే 108 నుంచి అధికారిక కాల్ రాకున్నా ఆపదలో ఉన్న యువకులకు మానవతా దృక్పథంతో సాయం చేసిన 108 సిబ్బందిని క్షతగాత్రుల బంధువులే కాకుండా స్థానికులు అభినందించారు. కాగా నిబంధనలతో పని లేకుండా ఆపదలో ఉన్న వారికి సాయం చేసిన తమ సిబ్బందిని అభినందించాల్సిన ఓ అధికారి వారిని మందలించినట్లు తెలుస్తోంది. ఆపదలో ఉన్న వారిని కాపాడడమే 108 లక్ష్యమైనప్పుడు సిబ్బందిని మందలించడమేంటని జనాలు మండిపడుతున్నారు.